బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



గంగనపల్లె గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



శ్రీనివాసపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది

ప్రొద్దుటూరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సూపర్ వైజర్ ఈశ్వరమ్మ తెలిపారు. మండల పరిధిలోని సోములవారిపల్లెలో మంగళవారం ఇంటింటా తిరిగి అవగాహన కల్పించారు. సంజీవనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.

■ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని దేవాంగ పేట సెక్టార్ జంగంపేట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి పోషకాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు.

■ దస్తగిరిపేట సెక్టార్‌కు సంబంధించి మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

■ నక్కలదిన్నె అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. సర్పంచ్ షమీమ్, సూపర్‌వైజర్లు కళావతి, రఫియా పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

మైదుకూరు : మండలంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గృహ సందర్శన కార్యక్రమం ద్వారా బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనలో కిశోర బాలికలున్న ఇళ్లకు వెళ్లి వారి తల్లులకు ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ వరలక్ష్మి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. ఆడ పిల్లలను చదివించాలని సూచించారు. చిన్న వయసులో పెళ్లి చేసే ప్రయత్నం చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని లీలావతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కాశినాయన : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ అన్నారు. మంగళవారం మండలంలోని గంగనపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించి అనంతరం బాల్యవివాహాల నిరోధక చట్టంపై మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నవయస్సులో పెళ్ళిళ్ళు చేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవు

గోపవరం : బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళిలు హెచ్చరించారు. మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలను అరికట్టేందుకు మండల కేంద్రం నుండి శ్రీనివాసపురం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన తహసీల్దారు, ఎంపీడీఓలు మాట్లాడుతూ అమ్మాయిలు 18 సంవత్సరాలు, అబ్బాయిలు 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత వివాహాలు జరిపించాలని, అలా కాకుండా బాల్యవివాహాలను ప్రోత్సహించినా, అందుకు సహకరించని వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు వారు హెచ్చరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, మోళ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

చాపాడు: మండల పరిధిలోని విశ్వనాథపురం గ్రామంలో మంగళవారం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అన్నారు. బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులందరూ తగిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకూ అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించారు.

క్లుప్తంగా

ఉచితంగా దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణారెడ్డి

కాశినాయన : మండలంలోని వరికుంట్ల ఎస్టీకాలనీ వాసులకు మంగళవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవడమే మా సంస్థ ఉద్దేశ్యమన్నారు. స్త్రీలకు చీరెలు, మగవారికి పంచలు, దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవాశ్రమం నిర్వాహకురాలు రామతులసి, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రాచమల్లు రవిశంకర్‌రెడ్డి

మైదుకూరు : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న మైదుకూరు మున్సిపాలిటీకి చెందిన హరీష్ అనే యువకుడికి మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు రాచమల్లు రవిశంకర్‌రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. వినాయక నిమజ్జనంలో బాణసంచా పేలి కొద్ది రోజుల కిందట మున్సిపాలిటీలోని భూమాయపల్లెకు చెందిన హరీష్ తీవ్రంగా గాయపడి, కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం రవిశంకర్‌రెడ్డి బాధితుడిని పరామర్శించి చికిత్స కోసం రూ.50వేలు అందించారు. హరీష్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

రాజుపాళెం : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయేశ్వరి, లక్ష్మీదేవిలు అన్నారు. పోషణ్ మాసోత్సవాలల్లో భాగంగా మంగళవారం మండలంలోని టంగుటూరు, గాదెగూడూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాల గురించి వారు తల్లులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి

బద్వేలు అర్బన్ : బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి తెలిపారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక గాండ్లవీధి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార విశిష్టతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని అన్నారు. అలాగే తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని వివరించారు. బాల్యవివాహాలను అరికట్టడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ప్రథమ్ సూపర్‌ట్రైనర్ స్వరూప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

3న స్పాట్ అడ్మిషన్లు

ప్రొద్దుటూరు : పాలీసెట్ 2023 ప్రవేశ పరీక్ష రాసి అర్హత పొంది, పొందని, పదో తరగతి పాసై, ఇంటర్ పాస్/ఫెయిల్ అయ్యి ఆసక్తిగల విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేరవచ్చని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ మెకానికల్, డీఈఈఈ, డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని, అక్టోబర్ 3న కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 99123 42022 సంప్రదించాలని కోరారు.

29న హుండీల ఆదాయం లెక్కింపు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో ఈ నెల 29న హుండీల ఆదాయాన్ని లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది సమక్షంలో ఆదాయం లెక్కించనున్నట్లు తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' ప్రజలకు వరం



మాట్లాడుతున్న మండల సచివాలయాల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి

అట్లూరు : జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలకు వరం లాంటిదని సచివాలయాల మండల కన్వీనర్ మన్యం మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొండూరు, అట్లూరు, ముత్తుకూరు, కుంభగిరి సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, ఏఎస్‌ఎంలకు స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలాంటి పథకాన్ని చేపట్టలేదన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్ళి స్థానిక వైద్య సిబ్బంది ద్వారా 7 రకాల ప్రాథమిక పరీక్షలు చేయించి అందులో ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరించేందుకు సమగ్ర సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ గిరీష్, ఎంఎల్‌ఓ సునీల్, ఏఎస్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్

గోపవరం : సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం కో ఆపరేటివ్ బ్యాంక్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సంఘాలను కిసాన్ సమృద్ధి కేంద్రాలుగా మార్చడంలో భాగంగా పోరుమామిళ్ళ, సిద్దవటం, బద్వేలు బ్రాంచ్ పరిధిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సంఘంలో సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన డిప్యూటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘం అధ్యక్షులు, సభ్యుల విధివిధానాలపై అవగాహన కల్పించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక రుణాల మంజూరు చేయడంతో పాటు రైతులు ఆర్థికాభివృద్ధి పెంపొందింపజేయాలన్నారు. కార్యక్రమంలో కడప డీసీసీ బ్యాంకు డీజీఎం బాలిరెడ్డి, సహకార సంఘాల అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సబ్ డీఎల్‌సీఓ ఈశ్వరయ్య, బద్వేలు బ్రాంచ్ మేనేజర్ కళావతి, సూపర్‌వైజర్ నారాయణ రెడ్డి, కో ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, సహకార సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అభివృద్ధికి సూచనలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్జేడీ బాబు

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంగళవారం ఆర్జేడీ పి.బాబు సందర్శించి కళాశాల అభివృద్ధికి పలు సూచనలు ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నరేష్ అధ్యక్షతన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని కళాశాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. కళాశాల ప్రస్తుతం న్యాక్‌లో సి గ్రేడ్‌లో ఉందని, ఏ గ్రేడ్‌కు వెళితే నిధులు అందుతాయన్నారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో రాణించాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. స్కిల్ హబ్‌కు చెందిన 30 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



కబడ్డీలో తలపడుతున్న బద్వేలు, అట్లూరు జెడ్పీ హైస్కూల్ బాలికలు

బద్వేలు అర్బన్ : క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బద్వేలు నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల ఎంపికలు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. తొలిరోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, త్రోబాల్ క్రీడల్లో అండర్-14, 17 బాలబాలికల విభాగాలలో ఎంపికలు నిర్వహించారు. రెండవ రోజైన బుధవారం రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో వంటి అథ్లెటిక్స్‌లో ఎంపికలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ గరల్స్‌హైస్కూల్ విద్యార్థులు ఇటీవల ఆర్‌సీపీఈ కళాశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ నియోజక వర్గస్థాయి పోటీలలో ప్రతిభ కనపరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 ఖోఖోలో ముగ్గురు, 17లో 5 మంది, కబడ్డీ అండర్ -14లో ఇద్దరు, 17 విభాగంలో 6 మంది, వాలీబాల్-14లో 6 మంది, 17లో 6 మంది, అథ్లెటిక్స్‌లో-14లో ఇద్దరు, 17లో 5 మంది, రిలేలో నలుగురు విద్యార్థినులు ప్రతిభ కనపరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాదరెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి అభినందించారు.

■ స్థానిక రామేశ్వరం ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ కు చెందిన 18 మంది క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనపరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, బాలయ్య అభినందించారు.

మహిళలకు వంటల పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న మహిళా శక్తి భవన్‌లో మంగళవారం ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గులాబ్ పర్వీన్, రెండో బహుమతి సావిత్రి, మూడో బహుమతి సృజన, స్పెషల్ బహుమతి సువర్ణ గెలుచుకున్నారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. మెప్మా టీఈ కెజియా జాస్లిన్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూట్రిషియన్ డాక్టర్ నాగజ్యోతి, ఇన్నర్‌వీల్ క్లబ్ ప్రెసిడెంట్ సరస్వతి, సెక్రటరీ ఉషారాణి, సభ్యులు పాల్గొన్నారు.

గాలీవాన

రాజుపాళెం : మండలంలోని దద్దనాల, పగిడాల, కూలూరు, కొట్టాల, గాదెగూడూరు తదితర గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున గాలీ, వానా బీభత్సం సృష్టించింది. వర్షం కూడా భారీగా పడటంతో మినుము, జొన్న, పత్తి, కంది పంటల్లో నీరు నిలిచాయి. దద్దనాల గ్రామంలో విద్యుత్ ట్రమ్ము కింద పడటంతో తిరిగి మరమ్మతులు చేపట్టారు.

29న వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 29న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆవరణంలో బహిరంగ వేలం వేయనున్నట్లు ప్రొద్దుటూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తాప్రభావతి

కలసపాడు : బద్వేలు నియోజకవర్గస్థాయి క్రీడాపోటీల్లో కలసపాడులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెర్సిమాలిని తెలిపారు. అండర్-14 వాలీబాల్ విభాగంలో శివ, లోకేష్, సంపత్, జాషు వా, అండర్-14 కబడ్డీ విభాగంలో చందు, వినోద్‌లు జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. అలాగే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కలసపాడులోని సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయిలో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చిత్తాప్రభావతి తెలిపారు. అండర్-17 కబడ్డీలో సి.హర్షవర్ధన్‌రెడ్డి, రంగరోహిత్, చరణ్, భరత్, వాలీబాల్‌లో ఓ. ప్రభాస్, నందకిషోర్, అండర్-14లో జైరామ్‌లు ప్రతిభ చాటారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు చిత్తాప్రభావతి, పాఠశాల పీఈటీ ప్రసాద్‌రావు, కమలమేరీలు అభినందించారు.

పోరాట యోధురాలు రజక ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : పెత్తందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాలు కొనసాగించిన యోధురాలు రజక ఐలమ్మ అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీసీ చైతన్య సమితి కార్యాలయంలో చిట్యాలఐలమ్మ 128వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడతూ అట్టడుగు వర్గాలైన చేనేత, కుమ్మరి, చాకలి లాంటి వృత్తిదారులను హీనంగా చూస్తున్న దొరలను ముప్పు తిప్పలుపెట్టిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. అలాగే పేదలకు భూములు దక్కేవరకు జమిందారులను, పట్వారీలను జనచైతన్యంతో తరిమి కొట్టిన ధీరవనిత ఐలమ్మ అన్నారు. ఇటువంటి వీరవనితను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ చైతన్యసమితి రాష్ట్ర అధ్యక్షులు బి.సి.రమణ, ఆవాజ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, అన్వర్‌బాష, మైనార్టీ నాయకులు రసూల్, ఖాజాగౌస్, రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు క్రిష్టయ్య, పట్టణ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్య ఉపాధి అవకాశాలకు దోహదపడుతుంది



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ వి.ఎస్.శ్రీనివాసమూర్తి

వేంపల్లె : సాంకేతిక విద్య అనేది ఉపాధి అవకాశాలకు దోహదపడుతుందని కెఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎస్.శ్రీనివాసమూర్తి అన్నారు. మంగళవారం వేంపల్లెలోని కందుల ఓబుల్‌రెడ్డి చారిటీస్ ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యలో పరిజ్ఞానం పెంచుకుంటే ఏ రంగంలోనైనా విద్యార్థులు రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఐటీఐ చదివిన ప్రతి విద్యార్థి ఆయా రంగాల్లో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉద్యోగాల కోసం ప్రయత్నం చేయాలన్నారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

1 నుంచి శనగ విత్తనాల పంపిణీ

రాజుపాళెం : రబీ సీజన్‌కు సంబంధించి అక్టోబర్ 1వ తేదీ నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో శనగ విత్తనాలను (జేసీ11) పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి శివరామ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 5,080 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయని, కావాల్సిన రైతులు విత్తనాలను తీసుకెళ్లాలని చెప్పారు. ఎకరానికి 40 కేజీల చొప్పున 5 ఎకరాల వరకు 200 కేజీలు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ ధర క్వింటాకు రూ.8,100 కాగా సబ్సిడీ ధర రూ.3,240 పోను రైతువాటా రూ.4,860 చెల్లించాలన్నారు. విత్తనాల కోసం వెళ్లేటప్పుడు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో పాటు ఫోన్ తీసుకెళ్లాలని వివరించారు.

ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా



రూ.2.20 లక్షలకు లడ్డును స్వంతం చేసుకున్న గానుగపెంట నాగరాజు కుటుంబ సభ్యులు

బద్వేలు అర్బన్ : వినాయకచవితి సందర్భంగా పట్టణంలో ఏర్పాటుచేసిన పలు విగ్రహాలకు 9వ రోజైన మంగళవారం కోలాహలంగా నిమజ్జనం నిర్వహించారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎన్‌జీవో కాలనీ సమీపంలో ఏర్పాటుచేసిన గణనాథునికి, లక్ష్మీపాళెం గొల్లఖాజా బావివీధిలో ఏర్పాటుచేసిన గణనాథునికి ఉండ్రాళ్లయ్యా.. ఉంటామయ్యా అంటూ నిర్వాహకులు నిమజ్జనానికి తరలించారు. పట్టణంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. సిద్దవటం రోడ్డులోని విగ్రహం గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన చెక్కభజన, కేరళ సింగారిమేళం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అర్బన్ సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రూ.2.20 లక్షలు పలికిన లడ్డు ధర

స్థానిక సిద్దవటం రోడ్డులోని ఎన్‌జీవో కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డు వేలంపాటలో గానుగపెంట నాగరాజు రూ.2.20 లక్షలకు లడ్డును సొంతం చేసుకున్నారు. అలాగే కరెన్సీ నోట్ల దండను బీరం హైమావతి రూ.1.53 లక్షలకు, బంగారు ఉంగరాన్ని బోవిళ్ళన రసింహారెడ్డి రూ.1.43 లక్షలకు, వెండి విగ్రహాన్ని కొల్లు సుబ్బారెడ్డి రూ.83 వేలకు, వెండి కుంకుమభరిణను పాపుదిప్పు చెంచిరెడ్డి రూ.55 వేలకు, వెండి కలశంచెంబును శివకిషోర్ రూ.50 వేలకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులు వారిని సన్మానించారు.

వినాయకుడికి పూజలు

ప్రొద్దుటూరు : పట్టణంలోని గిడ్డంగి వీధి, ఎర్రన్నకొట్టాలులో నెలకొల్పిన వినాయక విగ్రహాలకు మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీల వారు ఆయనకు, కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, పదోవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కసిరెడ్డి మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గురునాథరెడ్డి, వినోద్ రెడ్డిలకు తీర్థ ప్రసాదాలు అందించి శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు.

ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయం ఎదుట ధర్నా

మైదుకూరు : మైదుకూరులోని సహాయ సంక్షేమాధికారి కార్యాలయం వద్ద మంగళవారం రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (ఆర్‌ఎస్‌వైఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఓరుగంటి నాగేంద్ర బాబు మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్ , కందిమల్లాయపల్లెలో ఉన్న ఎస్సీ హాస్టల్-2 వార్డెన్ అవినీతి, అక్రమాలపై తక్షణమే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సెలవు రోజుల్లో ఒక్క విద్యార్థి కూడా హాస్టళ్లలో ఉండరని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌వైఎఫ్ మైదుకూరు పట్టణ నాయకులు లోకేష్, తేజా, నాయబ్, రవీంద్ర, పీరయ్య, విష్ణు, సాయి, రాము తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లెలో మంగళవారం ఏకలవ్య ఫౌండేషన్ చిన్న రైతు వ్యాపార సహకార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మాట్లాడుతూ.. 2022-23 ఏడాదికి గాను ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సభ్యత్వం ఇచ్చి వివిధ రకాలైన కార్యక్రమాలు నిర్వహించటం జరిగిందన్నారు. రైతులకు తక్కువ ధరలకు ఆముదం, పిండి బస్తాలు, పెట్రోల్ పంపులు, టార్పాలిన్ పట్టలు, మినుములు తక్కువ ధరలకు ఇవ్వనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

బద్వేలు అర్బన్ : ఎన్‌సీసీ ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ధైర్య సాహసాలు పెంపొందుతాయని ఎన్‌సీసీ-30 (ఎ) బెటాలియన్ సుబేదార్ రామ్‌స్వరూప్‌బిష్ణోయి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఎన్‌సీసీకి విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఫిజికల్, మెడికల్ పరీక్షల ఆధారంగా 40 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ బెటాలియన్ హవల్దార్ సమైసింగ్‌యాదవ్, కళాశాల ఎన్‌సీసీ ఏఎన్‌ఓలు లెఫ్టినెంట్ బాలఓబులేసు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.